నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, గురువారం 15 ఫిబ్రవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

యాసంగికి క్రాప్ హాలిడే

- వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి
- శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- తాగునీటి సరఫరాపై సమీక్షలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, ఫిబ్రవరి 14 : కృష్ణా బేసిన్‌లో సాగునీటి అవసరాలకు సరిపోయేంత నీరు లేకపోవడంతో ప్రస్తుత యాసంగి సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించినట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. బుధవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులతో తాగునీటి సరఫరాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి.. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. నాగార్జున సాగర్‌పై సాగు, తాగునీటికి ఆధారపడి ఉన్నామని, సాగర్ నుంచి పాలేరుకు నీరొస్తే సమస్యలు తీరుతాయన్నారు. వచ్చే మూడు నెలలు అత్యంత కీలకమైనవని, ఇందుకోసం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు నిత్యం ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో టచ్‌లో ఉండాలన్నారు. మిషన్ భగీరథ అందుబాటులో లేని ప్రాంతాల్లో పైపులైన్ వేయాలా.. సమస్య ఎలా పరిష్కరించాలో ఆలోచన చేయాలన్నారు. నీటి సరఫరా ఇబ్బందులు ఉన్నచోట ఓపెన్ వెల్, బోర్లు లీజుకు తీసుకునే చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలతో అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివకుమార్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, డీపీవో హరికిషన్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, నీటిపారుదల, తాగునీటి సరఫరా శాఖల ఇంజినీర్లు పాల్గొన్నారు.

'ఎఫ్ఎల్‌సీ' అత్యంత కీలకం : కలెక్టర్ ప్రియాంక ఆల

ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈవీఎంల మొదటి దశ పరిశీలన(ఎఫ్ఎల్‌సీ) అత్యంత కీలకమని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని ఆర్డీవో కార్యాలయంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ ఎఫ్ఎల్‌సీ, ఈవీఎం గోదాంలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం జిల్లాకు కేటాయించిన 1,588 బ్యాలెట్ యూనిట్లు, 1,424 కంట్రోల్ యూనిట్లు, 1,683 వీవీ ప్యాట్ల మొదటి దశ పరిశీలన గురువారం వరకు పూర్తి చేస్తామని, అనంతరం వాటిని ఈవీఎం గోదాంలో భద్రపరుస్తామన్నారు. ఈవీఎంలను, సీసీ టీవీల పనితీరును ఈసీఐఎల్‌కు చెందిన సాంకేతిక నిపుణుల బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ రంగా ప్రసాద్, సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

పెద్దల సభకు రేణుకా చౌదరి

- కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ఆమెను ఖరారు చేసిన పార్టీ అధిష్ఠానం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ఖమ్మం, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి గారపాటి రేణుకాచౌదరికి ఆ పార్టీ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తూ బుధవారం ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. తెలంగాణ నుంచి ప్రస్తుతం మూడు రాజ్యసభ సభ్యుల పదవులు ఖాళీ అవుతుండగా వాటిలో రెండు కాంగ్రెస్ పార్టీకి, ఒకటి బీఆర్ఎస్‌కు దక్కనున్నది. నామినేషన్ల దాఖలుకు గురువారం వరకే ఆఖరు గడువు కావడంతో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తమ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో నేడు ఆమె నామినేషన్ దాఖలు చేయనున్నారు.

ఆమె ప్రస్థానం ఇదీ..

రేణుకా చౌదరి 1999 లోక్‌సభా ఎన్నికల్లో ఖమ్మం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాజకీయాల్లో అరంగేట్రం చేసి గెలిచారు. తర్వాత 2004 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఖమ్మం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఖమ్మం నుంచి పోటీ చేసినప్పటికీ ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం సాధించారు. తర్వాత కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రేణుకా చౌదరికి రాజ్యసభ సభ్యురాలిగా అవకాశం కల్పించింది. నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో ఆమె కేంద్ర మంత్రిగా పని చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మిత్రపక్షంగా సీపీఐ ఉన్నది. దీంతో సీపీఐ నుంచి ఆ పార్టీ సీనియర్ నేత నారాయణ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆ ఎన్నికలకు రేణుకా చౌదరి దూరంగా ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఖమ్మం నుంచి రేణుకా చౌదరి పోటీచేసినప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుపై ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నేతగా రేణుకా చౌదరికి పేరున్నది. ఆమె ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే ఊహాగానాలు వచ్చినప్పటికీ అది జరగలేదు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ తరపున ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని ఉన్నప్పటికీ, ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ ఇక్కడి నుంచే పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. ఈ విషయమై రేణుకా చౌదరినే ఓ సందర్భంలో సోనియా గాంధీ ఖమ్మం నుంచి పోటీ చేయకపోతే తనదే సీటు అని మీడియా సమక్షంలో ప్రకటించారు. ఏదేమైనప్పటికీ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రస్తుతం ఆమెకు రాజ్యసభ అభ్యర్థిగా మరో అవకాశం కల్పిస్తున్నది. ఆమెకు ప్రాధాన్యమివ్వడాన్ని జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులూ స్వాగతిస్తున్నాయి.

వద్దిరాజు రవిచంద్రకు మరో ఛాన్స్

రాజ్యసభ అభ్యర్థిగా ఖరారు చేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

వద్దిరాజు రవిచంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ కవిత

ఖమ్మం, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను మరోసారి రాజ్యసభకు పంపించాలని బీఆర్ఎస్ అధిష్ఠానం నిర్ణయించింది. ఈమేరకు బుధవారం తమ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజు పేరును ఖరారు చేస్తూ ప్రకటన జారీ చేసింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రెండేళ్ల క్రితం వద్దిరాజుకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు. అనంతరం వద్దిరాజు పార్టీకి విధేయుడిగా పేరు తెచ్చుకున్నారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ప్రజల గొంతుకను వినిపించారు. గత శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుని అభ్యర్థుల గెలుపునకు శాయశక్తులా కృషి చేశారు. ఫలితాలు ఏమైనప్పటికీ ఆయన కృషి మాత్రం ఎనలేనిది. ఆయనకు ఇప్పటికే వ్యాపారవేత్తగా జిల్లాలో పేరున్నది. అలాగే సౌమ్యుడిగా, పేదల పెన్నిధిగా పేరు తెచ్చుకున్నారు. రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజును ప్రకటించడంపై గులాబీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పార్టీ అధిష్ఠాన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. రాజ్యసభ పరిధిలో ముగ్గురి స్థానాలు ఖాళీ అవుతుండగా వాటిలో రెండు స్థానాలు కాంగ్రెస్ పార్టీకి, ఒక స్థానం బీఆర్ఎస్‌కు దక్కాయి. దీనిలో భాగంగా బీఆర్ఎస్ తరపున వద్దిరాజుకు అవకాశం లభించింది. ఇప్పటికే ఖమ్మం జిల్లా నుంచి రాజ్యసభ సభ్యులుగా వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, లోక్‌సభ సభ్యుడిగా నామా నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తుండగా వీరిలో వద్దిరాజుకు తిరిగి రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం రావడం విశేషం. దీన్ని బట్టి గులాబీ బాస్ జిల్లాకు ఎంత ప్రాధాన్యమిస్తున్నారో చెప్పకనే చెప్పవచ్చు. కాగా.. గురు వారం ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా రేణుకా చౌదరికి ఆ పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించింది. దీంతో జిల్లా నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యులు పెద్దల సభలో తమ గొంతుక వినిపించే అవకాశం ఉందని, మున్ముందు జిల్లా ప్రజలకు మరింత మేలు జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఆంధ్రా టు హైదరాబాద్!

యథేచ్ఛగా కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణా

రాత్రికి రాత్రే తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

మూడు శాఖల ఆధ్వర్యంలో దాడులు.. 17 లారీలు పట్టివేత

లారీలను పొదలమాటున, రోడ్లపై వదిలి పారిపోయిన డ్రైవర్లు

అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన లారీలు ఇవే

సారపాక/బూర్గంపహాడ్, ఫిబ్రవరి 14 : ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్జనే ధ్యేయంగా కొందరు రాజకీయ, పలుకుబడి కలిగిన నాయకుల అండదండలతో లారీల ద్వారా ఇసుకను రవాణా చేసి సొమ్ము చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఆంధ్రా నుంచి హైదరాబాద్‌కు నిత్యం వందలాది లారీల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా.. సంబంధిత శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సారపాక, బూర్గంపహాడ్ మండలాల పరిధిలో టీఎస్ఎండీసీ, మైనింగ్, పోలీసు అధికారులు మంగళవారం రాత్రి ఆకస్మికంగా దాడులు నిర్వహించగా.. 22 లారీలకు పైగా ఇసుకను తరలిస్తూ పట్టుబడినట్లు సమాచారం. అయితే అధికారులు మాత్రం 17 లారీలపైనే కేసులు నమోదు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నా.. అక్రమార్కులు రూటు మార్చి హైదరాబాద్‌కు వివిధ మార్గాల ద్వారా రాత్రికి రాత్రే తరలిస్తూ లక్షలు గడిస్తున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతమైన ఆంధ్రా సరిహద్దు గుండాల ర్యాంపు నుంచి సుమారు 22 లారీల్లో ఇసుకను లోడ్ చేసుకుని భద్రాచలం బ్రిడ్జి మీదుగా సారపాక నుంచి హైదరాబాద్‌కు తరలించే క్రమంలో పై మూడు శాఖల అధికారులు మెరుపుదాడి చేసి లారీలను పట్టుకున్నారు. అయితే లారీ డ్రైవర్లకు ముందస్తుగా సమాచారం అందడంతో సారపాకకు వచ్చిన తర్వాత యార్డు వద్ద, బీపీఎల్ స్కూల్, పుష్కరవనం, మణుగూరు క్రాస్ రోడ్, సందెళ్ల రామాపురం, లక్ష్మీపురం యార్డు, పెట్రోల్ బంకు ప్రాంతం ఇలా.. ఎక్కడి లారీలు అక్కడే వదిలేసి పారిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడే విధంగా వ్యవహరిస్తూ.. ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపాలని పలువురు కోరుతున్నారు. కాగా.. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి టీఎస్ఎండీసీ పీవో పసుపులేటి శ్రీనివాస్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాపై గస్తీ ముమ్మరం చేశాం. మూడు రోజులుగా ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి మైనింగ్, పోలీసు శాఖల సహకారంతో దాడులు చేస్తున్నాం. మంగళవారం రాత్రి ఆంధ్రాలోని గుండాల ర్యాంపు నుంచి లారీల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న ముందస్తు సమాచారంతో దాడులు చేసి సుమారు 17 లారీలను పట్టుకుని వాటిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాం. ఇదిలా ఉండగా.. మొత్తం 22 లారీలు ఉన్నాయని 'నమస్తే' ప్రశ్నించగా.. రాత్రి సమయంలో చెట్లమాటున కొన్ని లారీలను నిలిపినట్లు తర్వాత తెలిసిందని, వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామని వివరణ ఇచ్చారు. పట్టుబడిన లారీలకు సంబంధించి జరిమానా విధిస్తామని పేర్కొన్నారు.

సింగరేణీయులారా రేపటి దేశవ్యాప్త సమ్మెకు దూరంగా ఉండండి

సింగరేణి సీ అండ్ ఎండీ బలరాం విజ్ఞప్తి

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 14: సింగరేణీయులు 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు దూరంగా ఉండాలని, విధిగా విధులకు హాజరుకావాలని సింగరేణి సీ అండ్ ఎండీ బలరాం బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల డిమాండ్లలో సింగరేణికి సంబంధించినవి పెద్దగా లేవని, ఉన్నా అవి సంస్థ యాజమాన్యం తీర్చగలిగినవి కావని ప్రకటించారు. సింగరేణి పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందని తేల్చిచెప్పారు. అలాంటప్పుడు సమ్మెలో పాల్గొనడం సమంజసం కాదన్నారు. సంస్థ వార్షిక లక్ష్యాలను ఛేదించాలని సంస్థ కోరుకుంటున్నదని, కానీ సంస్థ బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ తొలగింపులో కొంత వెనుకబడి ఉందన్నారు. వాటన్నింటినీ అధిగమించి లక్ష్యాలు ఛేదించాలంటే కార్మికుల సహకారం ఎంతో అవసరమన్నారు. కార్మికులు ఒక్కరోజు సమ్మె చేస్తే సంస్థ సుమారు రూ.85 కోట్లు నష్టపోతారని, కార్మికులూ సుమారు రూ.18 కోట్ల వేతనాలు కోల్పోతారని స్పష్టం చేశారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కార్మికులు విధులకు హాజరుకావాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన జిల్లా అధికారులు

ఖమ్మం జడ్పీ చైర్మన్ కమల్‌రాజును కలిసిన సీఈవో వినోద్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 14: బదిలీపై జిల్లాకు వచ్చిన పలువురు ఉన్నతాధికారులు బుధవారం తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. డీఆర్డీవోగా సన్యాసయ్య, జిల్లా సంక్షేమాధికారిగా రాంగోపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవోగా వినోద్, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి నూతనంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ వీపీ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో కూడా జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజును కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఖమ్మం నూతన డీటీవోగా ఆఫ్రీన్ సిద్దిఖ్

రఘునాథపాలెం, ఫిబ్రవరి 14: ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారిగా ఆఫ్రీన్ సిద్దిఖ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కేవీఎస్ శ్రీనివాసరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీటీవోగా ఉన్న మహ్మద్ గౌస్‌పాషా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో డీటీవోగా విధులు నిర్వహిస్తున్న ఆఫ్రీన్ సిద్దిక్.. ఖమ్మం రెగ్యులర్ డీటీవోగా రానున్నారు. దీంతో ప్రస్తుత ఇన్‌చార్జి డీటీవో మహ్మద్ గౌస్‌పాషా.. మహబూబాబాద్ డీటీవోగా వెళ్లనున్నారు.

పలువురు ఏసీపీల బదిలీ

ఎస్వీ రమణమూర్తి

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 14 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం టౌన్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌వీ.హరికృష్ణను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ విభాగానికి బదిలీ చేశారు. ఇల్లెందు డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్వీ రమణమూర్తిని ఖమ్మం ఏసీపీగా నియమించారు. ఖమ్మం రూరల్ ఏసీపీగా పని చేస్తున్న బస్వారెడ్డిని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు బదిలీ చేస్తూ.. ఆయన స్థానంలో మంచిర్యాల ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న బి.తిరుపతిరెడ్డిని నియమించారు. ఖమ్మం సీటీసీ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న టి.కృపాకర్‌ను సికింద్రాబాద్ డీఎస్ఆర్‌పీకి బదిలీ చేశారు.

ఎక్సైజ్ శాఖలో ఎస్ఐల బదిలీలు

ఎక్సైజ్ ఎండ్ ప్రొహిబిషనరీ శాఖలో పని చేస్తున్న పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పని చేస్తున్న ఎన్.అనిల్‌ను ఖిలా వరంగల్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వైరా స్టేషన్‌లో పని చేస్తున్న ఎతినేని మమతను కాజీపేట స్టేషన్‌కు బదిలీ చేశారు. వైరాలో పని చేస్తున్న రామిశెట్టి కీర్తిని మహబూబాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. వీరి స్థానంలో భద్రాచలం సీపీలో పని చేస్తున్న ఎన్.రత్నప్రసాద్‌రెడ్డి, మంథనిలో పని చేస్తున్న ఎం.సాయిరామ్‌లను బదిలీ చేశారు. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-1లో పని చేస్తున్న ఎస్‌కే రబ్బానీని భూపాలపల్లి స్టేషన్‌కు పంపించారు. ఆయన స్థానంలో మెట్‌పల్లిలో పని చేస్తున్న కె.సాయిబాబాను నియమించారు. సిరిసిల్లలో పని చేస్తున్న ఎం.శేఖర్‌ను సత్తుపల్లికి బదిలీ చేశారు. నేలకొండపల్లిలో పని చేస్తున్న పెంచల సందీప్‌రావును మెట్‌పల్లికి, బొంతల శంకర్‌ను మంచిర్యాలకు బదిలీ చేశారు. సింగరేణిలో పని చేస్తున్న బీర వెంకటరమణను మంచిర్యాలకు బదిలీ చేశారు. సత్తుపల్లిలో పని చేస్తున్న ఎం.వెంకటేశ్‌ను బెల్లంపల్లికి బదిలీ చేశారు.

జడ్పీ చైర్మన్‌ను కలిసిన జడ్పీ డిప్యూటీ సీఈవో

జడ్పీ చైర్మన్‌కు మొక్కను ఇస్తున్న డిప్యూటీ సీఈవో చంద్రశేఖర్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ శాఖల జిల్లా అధికారులకు బదిలీలు జరిగిన విషయం విదితమే. ఈ క్రమంలో ఖమ్మం జడ్పీ డిప్యూటీ సీఈవోగా పని చేస్తున్న చంద్రశేఖర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్‌కు బదిలీ చేశారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన ఆయన జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

రేపు ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్ ఎగ్జామ్

17న నైతికత, మానవ విలువలు, 19న పర్యావరణ విద్య పరీక్షలు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఈ నెల 16న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఐఈవో రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో జనరల్ విభాగం విద్యార్థులకు 20 మార్కులు, ఒకేషనల్ విద్యార్థులకు 10 మార్కులు కేటాయించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని 131 కళాశాలల నుంచి జనరల్ విభాగంలో 16,006 మంది విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 2,462 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. ఈ నెల 17న నైతికత, మానవ విలువల పరీక్ష, 19న పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా ఈ పరీక్ష రాసి ఉత్తీర్ణులు కావాలని సూచించారు.

పలుకే బంగారమాయెనా.. కోదండపాణి..

- నేలకొండపల్లిలో మూడో రోజూ మార్మోగిన రామదాసు కీర్తనలు
- విద్వత్ కళాపీఠంలో ముగిసిన వాగ్గేయకారుడి జయంత్యుత్సవాలు
- భక్తరామదాసు కీర్తిని ఇనుమడింపజేసేలా కొనసాగిన వేడుకలు

రామదాసు కీర్తనలు ఆలపిస్తున్న హైదరాబాద్ సంగీత కళాశాల అధ్యాపకులు

కూసుమంచి (నేలకొండపల్లి), ఫిబ్రవరి 14: 'తక్కువేమి మనకు.. రాముడు ఒక్కడుండు వరకు..', 'పలుకే బంగారమాయెనా కోదండపాణి.. కలలో నీ నామస్మరణ మరువ చక్కని తండ్రి..' అంటూ శ్రీరాముడి అపరభక్తుడు, ప్రముఖ వాగ్గేయకారుడు భక్తరామదాసు కీర్తనలు నేలకొండపల్లిలో మూడోరోజూ మార్మోగాయి. భక్తరామదాసు జయంత్యుత్సవాల్లో భాగంగా నేలకొండపల్లిలోని శ్రీరామదాసు విద్వత్ కళాపీఠంలో మూడు రోజులుగా కొనసాగుతున్న వేడుకలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఈ జయంత్యుత్సవాలకు వందలాది మంది కళాకారులు, కవులు, నృత్యకారులు హాజరయ్యారు. వీణనాదం, భరతనాట్యం, కూచిపూడి, సుందరాకాండ వంటి ప్రదర్శనలు కనువిందు చేశాయి. అలాగే రామదాసు కీర్తనలూ వీనులవిందు చేశాయి. శ్రీరామదాసు విద్వత్ కళాపీఠం ఆధ్వర్యంలో కొనసాగిన ఈ ఉత్సవాలు ఆ వాగ్గేయకారుడి కీర్తిని, శ్రీరాముడిపై ఆయనకు ఉన్న భక్తిని ఇనుమడింపజేశాయి.

అలరించిన ప్రదర్శనలు..

రామదాసు జయంత్యుత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాగ్యరాజ సంగీత కళాశాల బాధ్యుల ప్రదర్శనలు, దొడ్డు సీతారామయ్య వీణా కచేరి వంటి కార్యక్రమాలు అలరింపజేశాయి. కౌటూరి గాయత్రి, శిశిశ్రీ, లలితమ్మ శిష్యుల సంగీతం, వికాస తరంగిణి బాధ్యుల విష్ణు సహస్రనామ పారాయణం, కల్లూరు నిహారిక ఆలపించిన రామదాసు కీర్తనలు, పద్మ ప్రసూన వీణా కచేరి, వై.రమాప్రభ సంగీత కచేరి వంటివి భక్తులను ఓలలాడించాయి. శ్రీరామదాస విద్వత్ కళాపీఠం చైర్మన్ సాధు రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో కళాకారులనురామదాసు మెమెంటోలతో అందజేశారు. నేలకొండపల్లిలోని రామదాసు ధాన్య మందిరంలో భద్రాచల దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక విభాగం, నేలకొండపల్లి భక్త రామదాస విద్వాన్ కళాపీఠం సౌజన్యంతో జయంత్యుత్సవాలు విజయవంతమయ్యాయి.

రామదాసు క్షేత్రంలో చేయడం సంతోషంగా ఉంది..

మేము అనేక ప్రాంతాల్లో కూచిపూడి నాట్యం ప్రదర్శించాం. కానీ వాగ్గేయకారుడు భక్తరామదాసు క్షేత్రంలో చేయడం చాలా సంతోషంగా ఉంది. నేను కూచిపూడిలో డిప్లొమా చేస్తున్నాను. మా గురువులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ కళను ప్రదర్శిస్తున్నాను. చరిత్ర అనేది కళల్లో ఇమిడి ఉంటుంది. దానిని కాపాడడం కోసం అందరమూ కృషిచేయాలనేదే మా భావన. మన సంస్కృతికి అద్దంపట్టే ఇలాంటి అనేక కళలు ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్నాయి. తల్లిదండ్రులు వాటిని పిల్లలకు నేర్పించి మన సంప్రదాయాలు కాపాడేందుకు ప్రయత్నించాలి. డిగ్రీ చదువుతూనే కూచిపూడి నేర్చుకొంటున్నాను. నేలకొండపల్లిలో ప్రదర్శన ఇవ్వడం ఆనందంగా ఉంది.

–పెరుమాళ్ల లావణ్యశ్రీ, హైదరాబాద్

మైమరపించిన కీర్తనలు, వీణ నాదాలు

కీర్తనలు ఆలపిస్తున్న కళాకారుడు

భద్రాచలం, ఫిబ్రవరి 14 : భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న భక్త రామదాసు 391వ జయంత్యుత్సవాలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ఎన్.షణ్ముఖ శర్మ వయోలిన్ నాదం, సారపాకకు చెందిన వెంపటి శ్యామలాదేవి, వాణి, ప్రమీల, నాగమణి, అనూష, హేమలత, నాగలక్ష్మి ఆలపించిన రామదాసు కీర్తనలు శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. కపిలవాయి లలిత విజయ్‌కుమార్ ఆలపించిన కీర్తనలు మైమరపించాయి. హైదరాబాద్‌కు చెందిన ఏ.శివకృష్ణ స్వరూప్ వయోలిన్, ఉదుమూడి అనురాధ వీణ నాదం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నేండ్రగంటి కృష్ణమోహన్, కపిలవాయి విజయ్‌కుమార్ దంపతులు, కపిలవాయి సంజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'ఫోరం' చక్కటి వే